# ఆ ఒక్కడూ చాలడు




ఆరు నూరైనా నూరు ఆరైనా ఓ పచ్చినిజం చెప్పాలి. నెలకోమారు అందే పచ్చనోట్లు ఆ ఒక్కరోజే పున్నమినాటి చంద్రుడిలా జేబులో వికసించినా, ఆ మర్నాడు నుండే గ్రహణం పట్టిన చంద్రుడిలా నోట్లన్నీ క్షీణించిపోతాయి.

ఆపరిస్థితిని అధిగమించాలంటే అడ్డదారి ఒక్కటే మార్గం. దాన్ని కొంతమంది చూడలేక 'అవినీతి' అని పేరు పెట్టి గావుకేకలు వేస్తుంటారు. అలాంటివారినసలు పట్టించుకోకూడదని చక్రధర్ అభిప్రాయం. జీవితసిద్ధాంతం కూడా.

సౌమ్యని పెళ్లిచేసుకున్నాకే చక్రధర్ దశ తిరిగింది. కొడుకు మౌర్య పుట్టాక దర్జాగా దోచుకునే సీటు దొరికింది. అక్రమ సంపాదన కూడా బాగా పెరిగింది. అందరికీ తలా ఒకింత పోసి ఇల్లు కట్టించాడు. గృహ ప్రవేశం చేయగానే కొత్తగా ముడుపులు దండే

పరివారమంతా తలుపుతట్టారు.

ఇంటిపన్ను తగ్గాలన్నా, ఇంటికి కరెంట్ రావాలన్నా, కొళాయి శాంక్షన్, కనెక్షన్ కావాలన్నా, ఫోన్ ఫిట్టింగ్, వైరింగ్ చేయాలన్నా, దేనికదే మొత్తం చెల్లించుకోవాలి. చక్రధర్‌కి కాదు చక్రవర్తికైనా స్పేర్ చేసే ప్రసక్తే లేదని వారు వీరని కాదు అందరికీ సరిపడే మొత్తం పాతిక వేలన్నా కావాలిప్పుడు, అందుకని ఆఫీసులో కూర్చొని పెండింగ్ ఫైల్స్ అన్నీ తిరగేస్తే ఏమన్నా గిట్టుబాటవుతుందని సమాయత్తమయ్యాడు.

" అయ్యా! మా దొరగారు పంపారయ్యా, బిల్లు గురించి వాకబు చేయమన్నారండి" అంటూ ఓ వ్యక్తి వచ్చి పలుకరించాడు. మంచిటైముకి వచ్చాడని గబగబా ఫైలు తిరగేసి చూశాడు.

" మీ దొరగారి బిల్లు చాలా పెద్దదయ్యా, టెన్ లాక్స్" సన్నగా గొణిగాడు చక్రధర్.

" ఏమోనండి, వారొచ్చారు, మీతో మాట్లాడతారట. కారు దగ్గరున్నారు" అన్నాడతను.

చక్రధర్‌కి అర్థమైంది. హుషారుగా లేచి అతని వెంట వెళ్ళాడు. తెల్లని ఖద్దరు దుస్తుల్లో, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు, మెడలో గొలుసు, చేతికి మణికట్టు, చేతిలో సెల్‌ఫోను అక్రమసంపాదనలో ఆరితేరిన వాడిలా వున్నాడు కాంట్రాక్టర్ దొర.

చక్రధర్ నమస్కరించినా ఖాతరు చేయలేదు. పనికిమాలిన వాడిని చూసినట్లు నిరసనగా చూస్తూ, " మీరేనా మా బిల్లు చూసేది. ఇంకెంతకాలం పడుద్ది. పని పూర్తిచేసి ఇచ్చేయ్" అన్నాడు.

" ఫైల్‌లో, ఆబ్జక్షన్–" గొణిగాడు చక్రధర్.

" నథింగ్ డూయింగ్, రేపీపాటికి చెక్ పాసవ్వాలి. నా చేతికి అందాలి. మా డ్రైవర్ కవరొకటి ఇస్తాడు. పుచ్చుకుని పని పూర్తిచేయండి" అంటూ కారు డోర్ తెరిచి కూర్చుని, ఠీవిగా సూడసాగాడు.

డ్రైవర్ పరుగున వెళ్లి చక్రధర్ చేతికి కరన్సీ కవరొకటి అందించాడు. కాంట్రాక్టరు కారు వెళ్లిపోగానే చక్రధర్ ఆఫీస్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి సీక్రెట్‌గా కవరులో ఎంత వుందో చూసుకున్నాడు. వంద నోట్లు వంద రూపాయల కట్టను చూసి మనసు నెమ్మదించింది. ఆఫీసులో కొంతసేపు కాలక్షేపం చేసి ఇంటికి వెళ్ళాడు. సౌమ్యని పిలిచి లాకరులోపెట్టమని కవరు చేతికిచ్చి, లోనికి వెళ్ళాడు.

క్యాష్ చూడగానే సౌమ్య మనసులో గూడుకట్టుకున్న కోరిక చలరేగింది. ఆ వేళ చక్రధర్‌కి ఎంతో ప్రేమతో కొసరికొసరి భోజనం వడ్డించింది.

తన చెవికున్న దుద్దుల్ని ఓ మారు తడిమి చూసుకుంది. ఏవో జ్ఞాపకాల దొంతరలు. చక్రధర్ అప్పుడప్పుడు చిలిపిగా కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూసినప్పుడు, మురిపెంగా, నీ బుజ్జి ముఖానికి ఈ దుద్దులు ఏమాత్రం అమరలేదు. కొత్త డిజైన్స్ ఏమైనా సెలెక్ట్ చేసుకో, అని అంటుంటే, ఆ కోరిక ఎప్పుడు తీరుతుందా అని ఎదురుచూసే రోజు, ఇప్పుడొచ్చిందనుకొంది సంబరంగా.

చక్రధర్ భోజనం పూర్తిచేసి డ్రెస్సింగ్‌రూంలోకి వచ్చి సౌమ్యకి వినిపించేటట్లు, 'నేను ఆఫీసుకు వెళ్ళాక, హౌస్ టాక్స్ సూపర్‌వైజర్ వస్తాడు, నేనిచ్చిన దాంట్లో మూడు వేలు తీసి ఇవ్వు," అంటూ ఆర్డరు వేస్తూ తలదువ్వుకోసాగాడు.

" మూడు వేలా, అంతెందుకు " అంది ఆశ్చర్యంగా.

" అవన్నీ నీకెందుకు, చెప్పింది చేయ్" అన్నాడు

" అలాగేలెండి, మిగిలిన దాంట్లో ...." ఇంకా ఏదో చెప్పాలని బల్లమీద గిన్నెలు సర్దటం ఆపింది.

" ఫోన్ షిఫ్టింగ్‌కి లైన్‌మేన్ వస్తాడు, రెండు వేలిచ్చి పంపు, వెయి రూపాయలు ఆఫీసులో కట్టాలట" అంటూ డ్రెస్సింగ్ టేబిల్ దగ్గర నుండి డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాడు చక్రధర్.

"అదీపోతే, అయిదు వేలుంటుంది." అంది.

" అందులో ఓ రెండు వేలు కరెంటు మీటరు వేయడానికి వస్తాడు వాడికివ్వు. వచ్చిన వాళ్ళతో అధిక ప్రసంగంచేయక" సీరియస్‌గా అన్నాడు.

" నాకెందుకు అవన్నీను, లెక్క చూసుకోండి. ఇంకా మూడువేలుంటుంది." అంది సౌమ్య లెక్కలు కరెక్టుగానే చెపుతున్నట్లు.

భార్య ఎందుకిలా తరచి తరచి లెక్కలు వేస్తుందో చక్రధర్ పట్టించుకునే స్థితిలో లేదు.

' ఆ మూడూ కొళాయి కనెక్షన్ వాడికి సర్దేస్తే సరిపోతుంది. అన్నీ అయినట్లే." అంటూ షూ వేసుకోవడంలో నిమగ్నమైపోయాడు..

" ఏమైనా మిగిలితే మౌర్యకి ఇస్తారనుకున్నాడు. వాడికేదో పనుందట." అంది

నిరాశపడుతూ. అది అబద్ధమని మనసుకి తోచినా , తన గురించి నోరు విడిచి భర్తను అడగాలనిపించలేదు.

" చూద్దాంలే" అని తేలిగ్గా ఒక్కమాటలో చెప్పేసి తలుపువేసుకుని వెళ్ళిపోయాడు.

సౌమ్య మనసు చురుక్కుమంది. తన భర్త అందరికీ అడిగినంత డబ్బు ఇస్తున్నాడు. మరి తనేంచేస్తే వాళ్ళకిచ్చినట్లు ఇస్తాడు. ఏమైనా సర్దుకుపోవడమనేదిఈ మనసుకి ఎందుకు కలుగుతుంది అని తనని తాను నిందించుకుంది.

ఆ రోజు అనుకోకుండా సౌమ్య మామగారు ఇంటిముందు ఆటోలో దిగుతూనే ఆటో వాడితో ఘర్షణ పడుతుండటం చూసింది. అనుకోని అతిథుడ్ని చూసి ఆశ్చర్యపోయింది. తలుపులు తెరిచింది. చక్రధర్ తండ్రి జోగారావు ఎనభైఏళ్ళ వయోవృద్ధుడు. అయినా వ్యక్తిలో ఠీవి, దర్పం, హుందాతనం ఇంకా పోలేదు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అలవాటయిపోయింది. నేటి వ్యవస్థలో జరిగే మోసం, దగా,అవినీతి అన్నా అతని మనస్తత్వానికి పడనివి.

ఆటో వాడు మీటరు మీద నడపడంలేదని, దూరాన్ని మించి కిరాయి వసూలు చేస్తున్నాడని, చేరవలసిన చోటుకి వెళ్ళడానికి దొంగదారుల్లో వెళ్లడం, ఇవన్నీ జోగారావుకి గిట్టని పద్ధతులు. ఆటో వాడిని చెడామడా తిట్టి వదిలేశాడు.

సౌమ్య మామగార్ని చూడగానే ఈ తిక్కమనిషి వల్ల ఈఇంట్లో ఎన్ని గొడవలు తలెత్తుతాయోనని భయపడింది. ఇంటికొచ్చిన ఆయనకు అన్ని సపర్యలుచేసి విశ్రాంతి పుచ్చింది.

సరిగ్గా ఓ గంటకి భర్త చెప్పినట్లు ముడుపులు అందుకోవడానికి ఒకరితర్వాత ఒకరు రానే వచ్చారు. అందరికీ డబ్బు లెక్కపెట్టి ఇచ్చింది. అంతా వెళ్ళిపోయాక వెనక్కు తిరిగి సరికి ఎదురుగా మామగారు మౌనంగా నిలుచుని వున్నారు. గతుక్కుమంది సౌమ్య తప్పుచేసినదానిలా.

"ఏంటమ్మా ఇదంతా అబ్బాయే చెప్పాడా, ఇలా అందరికీ లంచాలిమ్మని, రానీ వాడు, అడుగుతాను" జోగారావు కంఠం ఖంగుమంది.

సౌమ్యహడలి పోయి బిక్కచచ్చిపోయింది. జవాబు చెప్పకుండా తలదించుకుంది. భర్త వచ్చాక ఏం రాద్ధాంతం జరుగుతుందోనని ఆందోళన పడింది. ఆ రాత్రి చక్రధరుడు రాగానే జోగారావు ధ్వజమెత్తాడు. తండ్రిని చూడగానే చక్రధర్ సంతోషించాడు. కాని

అది ఎంతోసేపు నిలవలేదు.

" ఏరా! అందరికీ లంచాలిచ్చి కావలసిన పనులు చేయించుకోవడం నీకు సిగ్గు, నామోషీ అనిపించలేదా?" అంటూ కొడుకువైపు ఆక్రోశంగా, అసహ్యంగా చూశాడు జోగారావు.

చక్రధర్‌కి అర్థమైపోయింది తండ్రికి అంతా తెలిసిపోయినందుకున్నాడు.

" ఆ! అవును. ఏం చేయమంటారు. పుచ్చుకున్న వాడు సిగ్గుపడాలి గాని నాకెందుకు? అయినా ఎప్పట్నించో వస్తున్న ఆనవాయితీ. మీకు తెలియదా? అంటూ సమర్థించుకున్నాడు చక్రధర్.

జోగారావు పౌరుషంగా తలఅడ్డంగా ఊపుతూ

" ఒరేయ్! ఏమిట్రా నువ్వనేది, మన అవసరాలు తీర్చుకోవడానికి ఎదుటి వారిని అవినీతి రొంపిలోకి దించుతున్నాం. నువ్వు నీతిగా, నిజాయితీగా వున్నప్పుడు ఎవర్నీ అర్థించనక్కర్లేదు. రేపు నాతోరా, నీ పనులన్నీ మాటమీద చిటికలో చేసి చూపిస్తాను" అన్నాడు ఎంతో సీరియస్‌గా.

చక్రధర్ గుండె గుభేల్‌మంది. ఈయన కలుగజేసుకుంటే అసలుకే మోసం వస్తుంది. ఈ రోజులు పూర్వపు రోజులు కావని ఈయనకు తెలియదు. ఏదో చెప్పి కట్టడి చేయాలనుకున్నాడు.

" డాడీ!దయచేసి మీరేమీ కలుగజేసుకోకండి. ఈ ఎడ్జెస్ట్‌మెంట్స్ లేకపోతే ఎక్కడ వ్యవహారాలు అక్కడే ఆగిపోతాయి. తప్పేంలేదు" అన్నాడు.

" ఏంటీ తప్పుకాదా? అయితే నువ్వూ లంచాలు మరిగావా? నీలాంటి స్వార్థపరులుండబట్టే వంద కోట్ల జనాభాలో సగానికి సగం మంది అవినీతి పరులే కనిపిస్తున్నారు. అదలా కేన్సర్‌లా పాకి అందర్నీ ముంచేస్తుంది. దేశమే అధోగతి పాలవుతోంది" అంటూ జోగారావు కలచివేసే తన హృదయభారాన్ని తట్టుకోలేక గట్టిగా ఊపిరిపీల్చివదిలాడు.

తండ్రి పలికిన కఠినమైన పరుషవాక్యాలకు చక్రధర్ తిరుగుబాటే ధ్యేయం అనుకున్నాడు. ఈ వయసులో వున్న వారికి చాదస్తం ఎక్కువ. తన మాటే వేదం అనుకుంటారని విసుగుచెందారు.

"నన్నంటారేమిటి. ప్రపంచమంతా మారిపోయింది. ఒకరినొకరు దోచుకోకపోతే మనుగడేలేని దుస్థితిలోవున్నాం. కాలంతో పాటు మనమూమారాలి. చేతులుకట్టుకు

కూర్చుంటే చవటంటారు.”

“ పొరపాటుపడుతున్నావ్. మనం మారాలంటే విలువల్ని తుంగలో తొక్కడం కాదు. సమాజ శ్రేయస్సును కాంక్షించి, ఉద్ధరించే దిశలోకి వెళ్ళాలి కాని అవినీతికి దాసోహం కావడం కాదు” ఉద్రేకంతో చిటపటలాడుతూ కొడుకుని మందలించాడు.

చక్రధర్ కూడా తన అహాన్ని అణచుకోలేక కేకలు పెట్టేసరికి సౌమ్య కలుగజేసుకుంది.

“ ఇక ఆపుతారా మీ కేకలు. మనలో మనం పోట్లాడుకుంటే ఒరిగిందేమిటి? నలుగురు నవ్వుతారు. మామయ్యగారు, నా మాట వినండి, మీరు పెద్దవారు బి.పి, షుగరు వుంది. ఆయనతో గొడవ పడితే మీ ఆరోగ్యం దెబ్బతింటుంది. నేను చిన్నదాన్ని అంతకంటే ఏం చెప్పలేను” అంటూ ఆ ఇద్దరి మధ్య జరిగే బేధాభిప్రాయానికి తెరదించింది.

పగలంతా జోగారావుకి తోచక మనవడ్ని పక్కన కూర్చోపెట్టుకుని మంచి మాటలు చెప్పసాగాడు. ‘ బాబూ! మౌర్య నేటి సమాజానికి నీకు పనికివచ్చే సూక్తి ఒకటి చెప్పనా” అన్నాడు.

“ చెప్పండి తాతయ్యా” అన్నాడు మౌర్య.

“జాతి గౌరవం నీతిపై నిలుచును. నీతిలేని జాతి అడుగంటిపోవును. నీతి కలుగు జాతి నిజమయిన జాతిరా” అంటూ హితబోధ చేశాడు.

మౌర్యకేమీ అర్ధంకాకపోయినా “ బాగుంది తాతా” అని మెచ్చుకోలుగా కామెంట్ చేశాడు.

జోగారావు ఆనందంతో పరవశించిపోయాడు.

ఓ రోజు మౌర్యకి, పరీక్ష ఫారమ్ మీద రెవెన్యూ అధికారి సంతకం కావలసివచ్చింది. చక్రధర్ కొడుకుని తీసుకుని వెళ్ళాడు. అక్కడ చిల్లరకొట్టుల్లా బ్రోకర్లు కూర్చొనివున్నారు. రకరకాల ధృవపత్రాలు, హామీ పత్రాలు, ఒకొక్క సర్టిఫికేట్‌కు ఒక్కో రేటు తీసుకుని ఇస్తున్నారు. చక్రవర్తి నేటివిటీ పత్రం కోసం బ్రోకర్ని ఆశ్రయించి రెండొందలకు ఒప్పందం చేసి డబ్బు ఇచ్చాడు.

ఇంటికొచ్చాక మౌర్యతాతగారికి చెప్పకనే చెప్పాడు. జోగారావు ఒంటో రక్తం ,, వేడెక్కిపోయింది. వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

అక్కడ జరుగుతున్న అవినీతి, అక్రమ దౌష్ట్యానికి పగబట్టే త్రాచులా బుసలు కొడుతూ

దగ్గర్లో వున్న పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేశాడు. అక్కడ కూడా చేతులు చాచేవారున్నా, ఇంతవరకు కంప్లైంట్ రాసిచ్చేవారెవరూ లేనందున జోగారావు పని జరిగింది. పోలీసులు వెంటనే వెళ్ళి బ్రోకర్లందరినీ ఏరి పారేసి, సెల్‌లో వేసి కేసు పెట్టారు తప్పదన్నట్లు.

చక్రధర్‌కి ఈ విషయం తెలిసి తన తండ్రి మీద ఉగ్రుడై ఆవేశంతో విరుచుకుపడ్డాడు. " మీరొక్కరే దేశాన్నుద్ధరించాలనుకోవడం గొప్ప కాదు. ప్రపంచంలో తొంభై అవినీతి దేశాల్లో మన దేశం అరవై తొమ్మిదో స్థానంలో వుందని మీకు తెలుసా, అంతా మీలాగే వుంటే ఇలా వుండేదా? మీరు చేసిన కంప్లైంట్ వల్ల మన ఇంటిమీదికి వచ్చి తిరగబడి, గొడవ చేస్తారు. నా పరువు, మర్యాద మంటగలిసిపోకముందే దయచేసి మీరు ఊరువెళ్ళిపోండి" అంటూ బ్యాగ్ తెచ్చి తండ్రికి ఇచ్చాడు.

జోగారావు నిర్ఘాంతపోయి గుండెల్లో దు:ఖం ఆపుకోలేక అటుఇటు కదలకుండా నిటారుగా నిలుచుండిపోయాడు. దూరంగా నిలుచున్న కోడలు వైపు తీక్షణంగా చూచాడు. ఆమె తలదించుకుని మౌనంగా నిలుచుంది. జోగారావు విలవిలలాడిపోయాడు.

తనకీ ఇంట్లో స్థానం లేదనుకున్నాడు. వికలమైన మనసుతో గుమ్మం దాటి వెళ్ళిపోయాడు. అవినీతికి గొడుగుపట్టే వారిపక్కన తనకి చోటు లేదు. కూడదు అనుకున్నాడు.

రోజులు దొర్లాయి. పరీక్షల్లో మౌర్యకు మంచి ర్యాంకు రాలేదు. సీటు దొరకలేదు. చక్రధర్ కొడుక్కి ధైర్యం చెప్పాడు. సీటు దొరికే మార్గం వుందన్నాడు. ఓపిక పట్టమని అభయహస్తమిచ్చాడు.

చక్రధర్ భగీరథ ప్రయత్నంలో రెండో దఫా కౌన్సిలింగ్‌లో మౌర్యకు సీటుదొరికింది. హాస్టల్‌లో చేరాడు. ఆరునెలలు గడిచాయో లేదో చక్రధర్‌కి అశనిపాతం లాంటి టెలిగ్రామ్ వార్త వచ్చిపడింది. మౌర్య ప్రమాదంలో వున్నాడని, ఆతృతతో హడావిడిగా బయలుదేరి వెళ్ళాడు. కాలేజి ఆవరణలోనే తెలిసింది మౌర్య ఆత్మహత్య చేసుకున్నాడని, దు:ఖంతో విలవిలాడిపోయారిద్దరు.

పోస్టుమార్టమ్ కోసం బాడీ ఆస్పత్రిలో వుంచారని తెలిసి అక్కడికి పరుగులు తీశారు.. జనం విపరీతంగా మూగివున్నారు. ప్రిన్సిపాల్ వచ్చి ,వీరిని చూసి" చూడండీ జరిగిన దానికి నేను చాలా విచారిస్తున్నాను. మంచి భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకున్నాడు" అన్నాడు.

వెక్కివెక్కి ఏడుస్తున్న మౌర్య తల్లిదండ్రుల్ని ఓదార్చుతూ, " ఏడవకండి ఇదంతా మీ వల్లే జరిగింది" అన్నాడు బాంబు పేల్చినట్లు.

దిగ్గునతలెత్తి చూశాడు చక్రధర్.

" మీరు సీటుకోసం ఫోర్జరీ కాస్ట్ సర్టిఫికేట్ పెట్టారా , లేదా అని ఎంక్వయిరీలో ఫాల్స్ అని ప్రూవ్ అయింది. వెరీ పిటీ థింగ్"

"నో! ఇట్ ఈజ్ ఇంపాజిబుల్ తప్పయితే సర్టిఫికేట్ ఎలా ఇచ్చారు " అన్నాడు చక్రధర్.

"ఏమో! మీ దొక్కటే కాదు చాలామంది వున్నారు. పెద్ద ఎత్తున ఫ్రాడ్ జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్ళింది. వెనువెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ కంప్లైట్, రిపోర్ట్ అందరికీ వెళ్ళాయట. ఎవరో ఆయన జోగారావట. ఇందులో మా ప్రమేయం ఏమీ లేదు "అని చెప్పాడు.

చక్రధర్‌కి , సౌమ్యకి షాక్ కొట్టినట్లయింది. విషణ్ణవదనులై శిలాప్రతిమల్లా వుండిపోయారు.

" జోగారావట, అవినీతి పోరాటం చేసి విజయం సాధించాడు. అయినా ' ఆ ఒక్కడు చాలడు' దేశానికిప్పుడు చాలామంది కావాలి'అంటూ వినిపించిన మాటలకి చక్రధర్, సౌమ్యఖిన్నులై కొడుకు శవం కోసం ఎదురుచూడసాగారు.

(ఆగస్టు 2002, స్వాతి)